ఖర్జూరం సాగు.. ఆదాయం బాగు


విరగ్గాసిన ఖర్జూరం పిందెలు


ఖర్జూరం తోట


మాగిన ఖర్జూరం పండ్లు

- మూడేళ్లలోనే పంట చేతికి..
- ఒక్కసారి పంట పెడితే 30 ఏళ్ల దాకా దిగుబడులు
- ఆదాయం బాగుందంటున్న రైతులు

అమరాపురం: మండలంలో ఏదో ఒక మూలన రైతులు కొత్త పంటలను సాగు చేసి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మన ప్రాంతంలో లేని పంటలను కనుక్కొని కొత్త వంగడాలు తెచ్చి ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అమరాపురం గ్రామానికి చెందిన రైతు ప్రభులింగప్పతో పాటు ఆయన సోదరుడు బీఏఎంఎస్ డాక్టర్ బసవరాజు తమకున్న పదెకరాల పొలంలో ఏదైనా కొత్త పంటలను సాగు చేయాలనుకున్నారు. ఇందులో భాగంగానే ఖర్జూరం పంట సాగుకు మొగ్గు చూపారు. అనుకున్నదే తడవుగా 2018లో తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురికి వెళ్లి అక్కడ రైతుల నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చిన ఖర్జూరం మొక్కలను ఒక్కొక్కటి రూ.4,500కు తీసుకొచ్చారు.

రెండున్నర ఎకరాల్లో సాగు

తమ్మడేపల్లి రోడ్డులో ఉన్న రెండున్నర ఎకరాల భూమిలో 100 మొక్కలను నాటారు. మొక్కలను నాటడంతో పాటు ఇతర ఖర్చులన్నీ కలిపి దాదాపుగా రూ.5.50 లక్షల ఖర్చు వచ్చింది. ఖర్జూరం మొక్కలకు బిందుసేద్యం అమర్చి నీటిని కూడా ఆదా చేసుకున్నారు. మూడు సంవత్సరాల తరువాత పంట చేతిరావడం ప్రారంభమైంది. 2021లో కోత కోయడం ప్రారంభించారు. ఒక కేజీ రూ.150 ప్రకారం అమ్మకాలు చేశారు. దీంతో ఖర్చులు పోనూ ఆ ఏడాది రూ.లక్ష చేతికొచ్చింది. ఆ తర్వాత 2022 సంవత్సరంలో రూ.2 లక్షల ఆదాయం వచ్చింది. 2023లో ఇప్పటి వరకూ రూ.1.50 లక్షల ఆదాయం సమకూరింది.

ఒకసారి సాగు చేస్తే చాలు

ఖర్జూరం పంటను ఒక సారి సాగు చేస్తే అందులో పిలక మొక్కలు వస్తాయి. వాటిని మళ్లీ వేరే చోట కూడా నాటుకోవచ్చు. అంతేకాదు అమ్మకాలు చేసినా ఒక మొక్క రూ.3 వేలకు అమ్ముడుపోతోందని రైతులు తెలిపారు. ఒక్కసారి పంట పెడితే 30 ఏళ్ల దాకా దిగుబడులు వస్తాయని, పంటను బాగా చూసుకుంటే 60 ఏళ్ల దాకా చెట్లు బతుకుతాయని రైతులు తెలిపారు.

కూలీ ఖర్చులు తక్కువ

ఖర్జూరం పంట సాగు మొదట కొంత మేర ఖర్చులు వస్తాయి. పంట కోత ప్రారంభించిన తరువాత ఖర్చులు పెద్దగా రావు. దీంతో ఆదాయం సమకూరుతోంది. తెగుళ్ల సమస్యలు కూడా తక్కువగా ఉంటాయి. పంట చేతికొచ్చే సమయంలో పక్షుల నుంచి కాపాడుకోవడానికి కవర్లు కట్టాలి.

ఆదాయం బాగుంది



ఖర్జూరం పంట సాగు చేయడానికి ఇబ్బంది లేదు. లోకల్‌గా కేజీ రూ.150 ప్రకారం అమ్మకాలు చేస్తున్నా. అలాగే బస్సుల్లో ఇక్కడి నుంచి బెంగళూరుకు తరలిస్తున్నాం. ఈ ఏడాది ఖర్చులు పోనూ రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది.

– ప్రభులింగప్ప, రైతు, అమరాపురం

క్లుప్తంగా

పిల్లలు పనుల్లో కాదు బడుల్లో ఉండాలి


రొద్దం: మెకానిక్ షాపును తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ

రొద్దం: చిన్న పిల్లలను వివిధ షాపుల్లో పనులకు పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని వెల్డింగ్, మెకానిక్, పలు దుకాణాలు, ఇటుకల తయారీ బట్టీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలు పనుల్లో కాదని బడుల్లో ఉండాలన్నారు. ఆదేశాలు పాటించకుండా నిర్లక్ష్యం చేసి పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మడకశిర: మండల పరిధిలోని బుళ్లసముద్రం సమీపంలో వంక నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

మల్బరీ సాగుతో అధిక లాభాలు


మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మల్బరీ సాగుతో రైతులు అధిక లాభాలు గడించవచ్చని శాస్త్రవేత్తలు ఏపీఎస్ఎస్ ఆర్‌డీఐ డా.సీతారాములు, నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం వారు మండలంలోని వీరాపురంలో మల్బరీ సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిరికల్చర్ అధికారి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌కు పరామర్శ


నారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: రెండు రోజుల క్రితం ఓ ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డిని ఎమ్మెల్యే శంకర నారాయణ మంగళవారం పరామర్శించారు. తుంగోడులోని నారాయణరెడ్డి నివాసానికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యులు అశోక్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: 'వైఎస్సార్ చేయూత, నేతన్న నేస్తం, అమ్మఒడి, వాహన మిత్ర, పెళ్లి కానుక, తదితర పథకాలపై కొంతమంది జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో విన్నవించారు.. వారందరితో ఈ-కేవైసీ చేయించాలి' అని ఎంపీడీఓ మునిస్వామి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. సచివాలయాల్లో కూడా ఉద్యోగులు ప్రజలు, రైతులకు సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధ్యతాయుతంగా పనిచేయకపోతే చర్యలు తప్పవన్నారు.

రాహుల్‌ను ప్రధానిని చేసుకోవడమే లక్ష్యం


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

హిందూపురం టౌన్: రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేసుకోవడమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు సుధాకర్, కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆదిమూర్తి, రవూఫ్, బాలాజీ మనోహర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

25న మడకశిరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మడకశిర: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 25న మడకశిరకు వస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన మడకశిరలోని వైబీ హళ్లి క్రాస్‌లో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ చేస్తారన్నారు. అలాగే స్థానిక మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కేతేపల్లి, నల్లనాయునపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని చాగలేరు గ్రామ సమీపంలో ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. రూ.5,270 నగదు సీజ్ చేశామన్నారు.

నేడు ధ్వజస్తంభ, కలశ పునఃప్రతిష్ట


ఆలయంలో శాంతి హోమం నిర్వహించిన దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని యర్రగోడపల్లి తండా గ్రామంలో బుధవారం యర్రగోడపల్లి ఆంజనేయస్వామి ధ్వజ స్తంభం , కలశ పునః ప్రతిష్ట , జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయంలో యాగశాల కుంభస్థాపన, శాంతి హోమం, ఆంజనేయ స్వామి మూల వస్త్ర గాయత్రి హోమం, లఘు పూర్ణాహుతి, కుంభ, అగ్ని ఆరాధన పూజలను పురోహితులు నిర్వహించారు.

ఓటమి భయంతో అసత్య ఆరోపణలు


గోరంట్ల: గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ

- ప్రతిపక్షాలపై ఎమ్మెల్యే శంకరనారాయణ ఆగ్రహం

గోరంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీలకు ఓటమి భయం పట్టుకుంది. అందుకే పచ్చమీడియ అండతో ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. వారి కుతంత్రాలను ప్రజలు వచ్చే ఎన్నికల్లో తిప్పి కొట్టాలి. నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలి' అని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. గోరంట్ల మండలంలోని పుట్టగుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని బూచేపల్లి, కొత్తపల్లి, పుట్టగుండ్లపల్లి, పుట్టగుండ్లపల్లి ఎస్సీకాలనీల్లో మంగళవారం సర్పంచ్ నార్పిరెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని సత్వరం పరిష్కరించాలని మండలస్థాయి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర నారాయణ మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా సంకల్ప పాదయాత్ర చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లారా చూసే అన్ని వర్గాల సంక్షేమం కోసం నవరాత్న పథకాలను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చారన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా అర్హులైన పేదలను గుర్తించి వారి ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు గడచిపోయాయని, ఇప్పటికే 99 శాతం హామీలను నెరవేర్చి చిత్త శుద్ధి చాటుకుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్ , ఎంపీటీసీ సభ్యులు ఓబుళరెడ్డి, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్. వెంకటరెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, నేసే శినాప్ప, ఆనంద్, శంకరరెడ్డి, ముసలిరెడ్డి, నరసింహులు, కిష్టప్ప, రాజారెడ్డి ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.


రొళ్ల: కొత్తపాళ్యంలో లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లాంటి పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని హొట్టేబెట్ట సచివాలయం పరిధిలోని కొడగార్లగుట్ట, కొడగార్లగుట్ట కాలనీ, కొత్తపాళ్యం తండా, కొత్తపాళ్యం గ్రామాల్లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, వైస్ ఎంపీపీ రత్నమ్మ, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ పేరుతో టీడీపీ ప్రభుత్వంలో మోసం చేయడంతో పాటు మహిళ సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌తో పాటు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఎన్ని యాత్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో సునామిలా కొట్టుకుపోవడం ఖాయమన్నారు. మరోసారి వైఎస్ జగన్‌కు ప్రజలు పట్టం కట్టడం ఖాయమన్నారు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, కొళాయిల ఏర్పాటు, ఇళ్ల మంజూరుతో పాటు కొడగార్ల గుట్ట వద్ద తెగిపోయిన సప్లయ్ చానల్ కల్వర్టును బాగు చేయించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రంగప్పరాజు, నాగేంద్ర, ఆనంద్‌నాయక్, ఆనంద్, నగేష్‌రంగారెడ్డి, రవికుమార్, ముద్దారెడ్డి, దేవదాసు, గోవిందప్ప, శ్రీరామప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి


అంబాజీ (ఫైల్)

లేపాక్షి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జి.అంబాజి (53) అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. గత నాలుగు నెలలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతునికి భార్యతో ఇద్దరు కుమారులున్నారు. మృతుని సొంత స్వస్థలం గుల్బర్గాలో అంత్యక్రియలు నిర్వహించారు.

సజావుగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ రేణుక

అగళి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రేణుక ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఏఓ శేఖర్ నాయక్ మాట్లాడుతు రైతులు 6,250 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను సాగు చేశారన్నారు. ఈ క్రాప్ బుకింగ్‌లో 200 ఎకరాలు కూడా నమోదు చేసుకోలేదని, సెప్టెంబర్ 10 లోపు రైతులంతా పంట నమోదు చేసుకోవాలన్నారు. వైద్యాధికారి శివానంద మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటలు పనిచేస్తోందని, వివిధ రకాల పరీక్షలతో పాటు ఎప్పుడు వచ్చినా గర్భిణులకు కాన్పులు చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ కుమార్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద అగళి పంచాయతీకి రూ.13 లక్షలు, పీ బ్యాడగెరకు రూ.7.5 లక్షలు, మధుడికి రూ.11 లక్షలు, నరసాంబుది పంచాయతీకి రూ. 5.5 లక్షల నిధులు మంజూరైటనట్లు చెప్పారు. ఎంపీడీఓ నరేంద్ర కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, ఎంఈఓ–2 చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గాయత్రి, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని బోయపేట, బెంగళూరు రోడ్లలో మంగళవారం దాడులు నిర్వహించి పట్టణానికి చెందిన ఈశ్వరప్ప, షేక్ యసన్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి 15 మట్కా పట్టీలు, రూ.11,250 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం


ఎంఆర్‌సీ సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక ఎంఆర్‌సీలో పనిచేస్తున్న తౌసిఫ్ ఖాన్, ఫైరోజ్, లలిత, వెంకటేష్‌లకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు రావడంతో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక చిన్మయ పాఠశాలలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

రొద్దం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న తహసీల్దార్ అనంతచారి, మండల సర్వేయర్ మైనుద్దీన్‌ను మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు రవిశంకర్, గంగాధరప్ప, పవన్, తిప్పేస్వామి, గోపాల్ పాల్గొన్నారు.

ఓటరు సర్వేపై సమావేశం

హిందూపురం టౌన్: ఇంటింటి ఓటరు సర్వేలో భాగంగా మార్పులు, చేర్పులు, తొలగింపులను చేపడుతున్నట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటరు నమోదుకు 2,461 దరఖాస్తులు, మార్పులకు 2,394 దరఖాస్తులు, తొలగింపుకు 1856 వచ్చాయన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు తండాకు చెందిన సుబ్బిబాయి అనే వివాహిత మంగళవారం రాత్రి పంటకు స్ప్రే చేసే పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలో ఉన్న సుబ్బిబాయిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆమె భర్త కృష్ణానాయక్ తెలిపారు. అయితే సుబ్బిబాయి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సిఉంది.

పాముకాటుకు గురైన విద్యార్థి

గోరంట్ల: మండలంలోని బెస్ట్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ మూడోసంవత్సరం చదువుతున్న తారకేష్ అనే విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. జీనంవాండ్లపల్లి సమీపంలోని హాస్టల్‌లో మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత బయట కూర్చొని ఉండగా పాముకాటేసింది. వెంటనే అతన్ని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అమ్మవార్లకు శ్రావణ మాస పూజలు


రొళ్ల: కొల్హాపురి మహాలక్ష్మీదేవి


గంధం అలంకరణలో వాసవీమాత

అమరాపురం: శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలో వెలసిన ఆర్య వైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరి మంగళవారం రాత్రి భక్తులకు గంధం అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు హరీష్ భట్టాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రొళ్ల: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దాతల సహకారంతో అన్నదానం చేశారు.

మారెమ్మ ఆలయంలో..

మండల పరిధిలోని జీఎస్ పాళ్యంలో వెలసిన గ్రామ దేవత మారెమ్మ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

నిధులు మంజూరు చేయించండి

హిందూపురం: స్థానిక నింకంపల్లిలోని జామియా మసీద్ ఆధీనంలో శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు సహకరించాలని జామియా మసీదు కమిటీ సభ్యులు మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్పొరేషన్ ప్రతినిధులతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కౌన్సిలర్ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు తెలిపిన నూతన సర్పంచ్

చలివెందుల గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన ఉపేంద్రకుమార్‌రెడ్డి మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి

పరిగి: ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక విప్లవాత్మక మార్పులు చేపట్టిందని అందులో భాగంగా జరుగుతున్న నాడు– నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓలు శేషాచలం, లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం వారువేర్వేరుగా ఎన్ ముద్దిరెడ్డిపల్లి , కాలువపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.